క్లుప్తంగా

75 శాతం స్కూళ్లకు ఉచిత స్కూల్ కిట్ల పంపిణీ


స్కూల్ కిట్లను పాఠశాలల ఇన్‌చార్జ్‌లకు అప్పగిస్తున్న ఎంఈఓ-2 వెంకట రమేష్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 75 శాతం ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేసే స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. అర్బన్, రూరల్ లో మొత్తం 81 ప్రభుత్వ పాఠశాలలుగా ఉండగా 13,911 మందికి విద్యార్థులు ఉన్నట్లు ఎంఈఓ-2 వెంకటరమేష్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్ట్‌లు పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో ఉంచి అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి దాకా దాదాపు 63 పాఠశాలలకు కిట్లను సరఫరా చేశామని, మరో రెండు రోజుల్లో అన్ని పాఠశాలలకు పంపిణీ పూర్తవుతుందన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


హరేసముద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ మల్లీశ్వరి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు మల్లీశ్వరి, శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని హరేసముద్రంలో సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, విజయలక్ష్మీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాపంపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం


పాపంపల్లిలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వెటర్నరీ వైద్యులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాపంపల్లిలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ పశువైద్య శిబిరంలో 87 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ, చూడి పరీక్షలు చేశారు. 27 లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. జిల్లా పశు ఘనాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్, గొడ్డు మోతు పశువులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ గుప్త, వెంకటేష్, వెటర్నరీ వైద్యులు మంజునాథ్, రమేష్, హరని, ఏహెచ్‌లు శశికళ, పుల్లారెడ్డి, తిమ్మరాజు, సతీష్, గోపాలమిత్ర నాగార్జున రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో 'అతిసార'ను అరికట్టొచ్చు


కూడేరు : జాగ్రత్తలను తెలియజేస్తున్న డాక్టర్ సౌమ్యారెడ్డి

కూడేరు: అప్రమత్తతతో అతిసారను అరికట్టొచ్చని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలియజేశారు. మంగళవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) వాంతులు , విరేచనాలతో బాధపడుతున్న పలువురు వైద్యం కోసం వచ్చారు. వారికి డాక్టర్ సౌమ్యా రెడ్డి వైద్య సేవలందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. అతిసార వ్యాధి సాధారణమైనా కొన్ని సందర్భాల్లో ప్రమాదకరమన్నారు. కలుషిత నీరు తాగడం, ఈగలు కూర్చున్న ఆహారం తినడం ద్వారా అతిసార వ్యాపిస్తుందన్నారు. అతిసార బారిన పడినప్పుడు కడుపు నొప్పిగా ఉండడం, విరేచనాలు, వాంతులు అవుతాయన్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు.

పొలం విషయంలో మహిళపై దాడి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బాలవెంకటపురంలో పొలం విషయంలో జరిగిన దాడిలో ఓ మహిళ గాయపడింది. బాధితురాలు నాగలక్ష్మి తెలిపిన మేరకు...బాలవెంకటపురం గ్రామానికి చెందిన గోపాల్ అనే రైతుకు చెందిన భూమిని గతంలో సర్వే చేసిన సమయంలో కొంత భూమి నాగలక్ష్మికి వెళ్లింది. అప్పటి నుంచి పొలం విషయంలో ఇద్దరూ గొడవ పడుతుండేవారు. అయితే మంగళవారం పొలం పనుల్లో నాగలక్ష్మి ఉండగా, గోపాల్ అతని భార్య, కొడుకు కలిసి నాగలక్ష్మిపై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన నాగలక్ష్మిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

ఆస్థాన కొలువులు ఎవరికో?

పోస్టింగుల కోసం పైరవీలు..
- అమాత్యుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- చక్రం తిప్పుతున్న దిగువస్థాయి నేతలు
- అన్ని శాఖల్లోనూ అనుయాయులకే పెద్దపీట
- ఏ సీటుకు ఎవరొస్తారో..?



రాయదుర్గం: ఇటీవల సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. రాష్ట్రంలో ఈనెల 4న నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఇంకేముంది ఎన్నికల విభాగంలో పాల్గొన్న అధికారులకు త్వరలో స్థాన చలనం ఉండబోతుంది. ఈ నేపథ్యంలో తమకు నచ్చిన సీటు రిజర్వ్ చేసుకునేందుకు ఉద్యోగులు విశ్వ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు ఓ వైపు పైరవీలు.. మరోవైపు వారి చుట్టూ ప్రదక్షిణలు జోరందుకున్నాయి. జిల్లాలో ఇప్పటికే రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ ముఖ్య విభాగాల్లోని కుర్చీలు ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. అప్పుడే దిగువ స్థాయి నేతల నోట సీఐ ఎవరు..? ఎస్‌ఐ ఎక్కడి నుంచి వస్తారు..? తహసీల్దార్, ఎంపీడీఓ ఎవరై ఉంటారు..? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలకు మూడు నెలల ముందు వచ్చిన కొందరు అధికారులు ఇక్కడి వాతావరణం కాస్త అలవాటు పడినవారు ఉన్నారు. తమకు ఏ పార్టీతోనూ సంబంధం లేదు. ఓ ఏడాది లేదా రెండేళ్ల పాటు కొనసాగే అవకాశం ఇప్పించాలని ఎమ్మెల్యేలకు అత్యంత సన్నిహితులు, ప్రధాన అనుచరుల చుట్టూ పైరవీలు సాగిస్తున్నారు. ప్రయత్నాలు ఫలించేట్టు కనిపించక సర్దుకునే బాటలో ఉన్నట్టు సహ ఉద్యోగులు మాట్లాడుతున్నారు. ఏ కార్యాలయం వద్దకు వెళ్లినా ప్రస్తుతం ఇదే హాట్ టాఫిక్‌గా మారింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ మొదలు అన్ని విభాగాల్లోని అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం ఊపందుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమన్యాయంతో వెళ్లిన అధికారులకూ స్థాన చలనం జాబితాలో మొదటి వరుసలో ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలు ఎవరికి పచ్చజెండా ఊపుతారో వేచి చూడాల్సి వస్తోంది.

అప్పుడే హడావుడి..?

గ్రామాల్లో ఎఫ్‌పీ షాఫ్ డీలర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఉపాధి క్షేత్ర సహాయులు, ఆశా వర్కర్లు, ఐకేపీ యానిమేటర్లు, బ్యాంకు మిత్రలు, వలంటీర్లు ఇలా ఏవీ వదలకుండా మార్పు జరిగేలా క్షేత్ర స్థాయిలోని పార్టీ కేడర్ మొత్తం సమాయత్తమైంది. ఇప్పటికే పలువురు స్వచ్ఛందంగా వదిలి వెళ్లగా, మరికొందరిపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం మొదలైంది. ఈ పోస్టులన్నీ టీడీపీ సానుభూతి పరులకు దక్కేలా దిగువ స్థాయి శ్రేణులు చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం మారింది కాబట్టి ఇది సర్వసాధారణమని కొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనా పోస్టింగుల కోసం కొందరు, ఉన్న ఉద్యోగాలను కాపాడుకునేందుకు మరికొందరు అమాత్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బిజీగా కనిపిస్తున్నారు.

కేంద్ర బృందం రేపు పర్యటన

వజ్రకరూరు: మండలంలో ఈనెల 20న కేంద్రం బృందం (మినిస్టీరియల్ టీం - ఐఎంసిటీ) పర్యటించనున్నట్లు ఏఓ మధుకర్ తెలిపారు. మంగళవారం వజ్రకరూరులో ఏఓ విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 11 గంటలకు గూళ్యపాళ్యంలో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్ (పంటకాలం)కు సంబంధించిన కరువు ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించనున్నట్లు ఏఓ తెలిపారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించి పంట నష్టం వివరాలను సేకరించనున్నట్లు తెలిపారు.

విడపనకల్లు: 2023 సంవత్సరంలో రబీలో పప్పుశనగ సాగు చేసి నష్ట పోయిన రైతుల వివరాలను సేకరించడానికి ఈనెల 20న కేంద్రం కరువు బృందం పర్యటిస్తున్నట్లు ఏఓ పెన్నయ్య మంగళవారం తెలిపారు. మండలం వాప్తంగా దాదాపు 450 హెక్టార్లో రైతులు పప్పుశనగ సాగు చేసి, దాదాపు రూ.500 కోట్లు పంట నష్టం వాటిల్లినట్లు గతంలోనే నివేదికలు జిల్లా అధికారులకు పంపినట్లు ఏఓ తెలిపారు.

రేపు వాహనాల వేలం

ఉరవకొండ: ఉరవకొండ ఎక్సైజ్ సెబ్ కార్యాలయ పరిధిలో మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 20న వేలం వేస్తున్నట్లు సెబ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.3 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

వేరుశనగ పంట పరిశీలన


అంతరగంగలో తెగుళ్లు సోకిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ విజయకుమార్

కూడేరు: మండలంలోని వ్యవసాయ బోరుబావుల కింద ఖరీఫ్‌లో ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ పంటను వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఏఈఓ శైలజ, ఎంపీఈఓ శ్రీలత తదితరులు పరిశీలించారు. మంగళవారం ×వేరుశనగ పంటకు తెగుళ్లు¤ శీర్షికన ×సాక్షి¤లో వార్త ప్రచురితమైంది. వ్యవసాయాధికారులు స్పందించారు. మండల పరిధిలోని ఇప్పేరు, అంతరగంగ, కమ్మూరు గ్రామాల్లో పర్యటించి, తెగుళ్ల బారిన పడిన వేరుశనగ పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు సూచించారు. లద్దె, పచ్చ పురుగు నివారణకు లీటర్ నీటిలోకి 5 ఎంఎల్ వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. మూడు రోజులు తర్వాత ప్రొఫెనోఫోస్ ఒక లీటర్ నీటిలోకి 2 ఎంఎల్ లేదా అసిపేట్ 1.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే కాండం, వేరుకుళ్ల నివారణకు ఒక లీటర్ నీటిలోకి సాఫ్ లేదా హెక్సాకొనజోల్ 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. విత్తన శుద్ధి చేస్తే విత్తనం విత్తిన 30 రోజులు వరకు పంటకు ఎలాంటి తెగుళ్ల ఆశించవని ఏఓ రైతులకు సూచించారు.

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గూడెన్న

కణేకల్లు: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని ఎంపీడీఓ గూడెన్న పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో ఎంపీడీఓ మాట్లాడారు. 4,300 మందికి జాబ్ కార్డులుంటే వెయ్యి మంది మాత్రమే పనులకు వస్తున్నారన్నారు. కుంటకట్టలు, ఎంపీటీలు, డగౌట్‌ఫాండ్స్ పనులు చేపట్టాలన్నారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌పై రైతుల్లో అవగాహన కల్పించి మొగ్గు చూపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు సోమన్నగౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి 60 కేజీల విత్తనాలు వేయాలి


పెద్దకొకుంట్లలో వేరుశనగ విత్తుతున్న రైతు వన్నూరప్పకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శుభకర్

ఉరవకొండ: నియోజకవర్గంలో వేరుశనగ సాగు చేస్తున్న రైతులు ఎకరాలకు 60 కేజీల వేరుశనగ విత్తనాలు వేసుకోవాలని ఏఓ శుభకర్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కొకుంట్ల గ్రామంలో వేరుశనగ విత్తనం విత్తుతున్న రైతుల పొలాల వద్దకు వెళ్లి సూచనలు చేశారు. రైతులు ఎకరానికి 100 కేజీల నుంచి 120 కేజీల వేరువనగ విత్తనం విత్తుకుంటున్నారని, దీనివల్ల రైతుకు పెట్టుబడి పెరగడమే కాకుండా దిగుబడి తగ్గుతుందన్నారు. ప్రతి రైతూ కచ్చితంగా విత్తన శుద్ధి చేయాలని, మంకోజ్ , కెప్టన్, ఏదో ఒకటి మూడు గ్రామాలు కేజీ విత్తనానికి పట్టించి విత్తుకోవాలన్నారు. వేరుశనగ రైతులు రైజోబియామ్ కల్చర్‌ను వాడుకుంటే అధిక దిగుబడి సాధించుకోవచ్చన్నారు. పెద్దకొకుంట్లలో రైతులు వన్నూర్ స్వామి, నాగరాజు తదితరులకు అవగాహన కల్పించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య

రాయదుర్గంటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య పేర్కొన్నారు. ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు కోర్టులో జాతీయ లోక్ అదాలత నిర్వహించనున్నట్లు జడ్జి ఓ ప్రకటనలో తెలిపారు. రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించబడుతాయన్నారు. కేసుల ద్వారా కక్షిదారులు ఇబ్బందులతో పాటు సమయం వృథా అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కక్షిదారులు కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీ


రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది


కూడేరు మండలం ఇప్పేరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


పాల్తూరులో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయదుర్గంటౌన్: ఆటపాటలతో విద్య, పిల్లల పౌష్టిక ఎదుగుదలకు మూడేళ్ల పిల్లలను సమీప అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ పరిధిలోని చిన్న పిల్లలను మీద అంగన్‌వాడీ నినాదాలు రాయించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజేత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. మూడేళ్ల పైబడిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు పాఠశాల హెచ్ఎం నారాయణ స్వామి కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ,అంగన్‌వాడీ టీచర్లు దుర్గ,ఆయాలు పాల్గొన్నారు.

కూడేరు: మూడేళ్లు పూర్తయిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి కోరారు. మంగళవారం మండలంలోని ఇప్పేరులో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ చేశారు. సూపర్ వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త పారిజాత మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పారిజాత, హెల్పర్, ఆయాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

కంబదూరు: తల్లిదండ్రులు ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సీడీపీఓ వనజ అక్కమ్మ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్‌లో ఆటపాటలు నేర్చుకొని ఐదేళ్ల వయస్సు నిండిన 12 మంది అంగన్‌వాడీ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం చేర్పించారు.ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయనిర్మల, సంపత్తమ్మ, మరియమ్మ, మల్లిక, ఫరీద, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకున్న పిల్లలతో సీడీపీఓ వనజ అక్కమ్మ

ప్రజల అందరూ ప్రేమతో మెలగండి


కళ్యాణదుర్గం మార్కెట్ యార్డ్‌లో మాట్లాడుతున్న అంతర్జాతీయ ప్రసంగీకులు దీవెనయ్య

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలందరూ ప్రేమతో మెలగాలని అంతర్జాతీయ ప్రసంగీకులు, సువార్తీకులు దీవెనయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో రెండో రోజు సువార్త ఉజ్జీవసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ప్రసంగీకులు దీవెనయ్య బైబిల్ సందేశం ఇచ్చారు. రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బ్రదర్ చల్లా కిశోర్, పాస్టర్ బసవరాజు, మైనార్టీ నాయకులు రవికుమార్, జోసప్ కిశోర్, స్వరూప్ కుమార్, రోజ్లీ రాజేష్, పాస్టర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రితాత స్వామి ఆలయంలో మంత్రి కేశవ్ పూజలు


మంత్రికి లక్ష్మీనృసింహ స్వామి చిత్రపటం అందిస్తున్న ఈఓ, వేదపండితులు

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురంలో వెలసిన ఎర్రితాత స్వామి ఆలయంలో రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం పూజలు చేశారు. మంత్రికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.

అనంతరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి చెందిన వేదపండితులు, ఆలయ ఈఓ విజయ్‌కుమార్, గ్రూప్ టెంపుల్స్ ఈఓ అంగదాల కృష్ణయ్య కౌకుంట్లలోని మంత్రి నివాసంలో స్వామి చిత్రపటాన్ని బహూకరించి, అనంతరం వేదపండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం కౌకుంట్ల గ్రామంలోని మంత్రి కేశవ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ తిమ్మప్ప తదితరులు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగులు,బెల్ట్, తదితర వాటిని పంపిణీ చేశారు. ఎంఈఓ తిమ్మప్ప మాట్లాడుతూ మండలంలో 29 ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మండలానికి ఇప్పటి వరకు 30వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయని, మరో 25వేల పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

వినాయక ఉత్సవ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గంటౌన్: రాయదుర్గం వినాయక ఉత్సవ సమితి నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా దేవరెడ్డిపల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా మాదుగొండే మల్లికార్జున, కోశాధికారిగా మద్దిలేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బుగుడే చన్నవీర, ఇట్ట గిరీష్, గొడిశలపల్లి ధనుంజయరెడ్డి, కోమండూరు కృష్ణమూర్తి, గుద్దిటి లోకేష్, రవిచంద్ర, సహ కార్యదర్శులుగా తట్టే నాగేష్, వగ్గా ఆంజనేయులు, తిప్పేస్వామి, చుంచుల శ్రీనివాసులు, వడ్డే ప్రేమ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జయంతి విష్ణు, నర్సేపల్లి కిశోర్, శ్రీధర్, చన్నకేశవ, బాలకృష్ణ, మహేష్, వినోద్‌కుమార్‌లు, గౌరవాధ్యక్షులుగా తాయి శేఖర్, గోపాల్‌రెడ్డి, టంకశాల హనుమంతు, గౌని ప్రతాప్‌రెడ్డి, లద్దు సత్యనారాయణ, గ్యాస్ కృష్ణ, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేశులు శెట్టి, పొరాళ్ల శివ, కాసుల ప్రసన్నలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు గౌరవాధ్యక్షుడు గౌని ప్రతాప్ రెడ్డి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కొండాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


బెళుగుప్పలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ చేస్తున్న అధికారులు


మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ తదితరులు

రాయదుర్గం రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆవులదట్ల పీహెచ్‌సీ పరిధిలోని డి.కొండాపురంలో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్ , పంచాయితీ సెక్రెటరీ భీమేష్ ఏఎన్ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ స్వామి, ఎంఎల్‌హెచ్‌పీలు రేణుక, ప్రమీల, యోచన మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించండి

విడపనకల్లు: మండలంలోని మాళాపురం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థినులకు మలేరియా అధికారి కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విడపనకల్లులో ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ సత్యబాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు కలిసి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

విషజ్వరాలు ప్రబలకుండా అవగాహన

బెళుగుప్ప: దోమల బారిన ప్రజలు పడకుండా, విషజ్వరాల ప్రబలకుండా గ్రామాల్లో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి తిరుపాలయ్య ఏఎన్ఎంలు కేజీబీవి విద్యార్థినులతో కలసి వైద్యాధికారి మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధానంగా దోమల బారి నుంచి జాగ్రత్తలు పాటించి, కాపాడుకుందాం అని ఈనెల 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ తిమ్మప్ప, హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగశంకర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


విడపనకల్లులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

విద్యుత్ కేబుల్ అపహరణ

గుమ్మఘట్ట: మండలంలోని ఆర్.కొత్తపల్లికి సమీపంలో వ్యవసాయ విద్యుత్ కేబుల్ చోరికి గురైనట్లు బాధితులు తిప్పేస్వామి, వెంకటరెడ్డి తెలిపారు. తిప్పేస్వామి సోమవారం నూతన మోటారు అమర్చాడు. మంగళవారం వేకువజామున పొలం వద్దకు వెళ్లి చూసే సరికి కేబుల్ కనిపించలేదు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.